# హ్యాప్పీ క్రిస్మస్



మంథనిలోని బేతేలు గాస్పెల్ చర్చిలో చిన్నారితో కలిసి కేక్ కట్ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, డిసెంబర్ 25: క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా చోట్ల చర్చిల వద్ద క్రైస్తవులకు ప్రజాప్రతినిధులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కాగా, మంథనిలోని బేతేలు గాస్పెల్ చర్చిలో జరిగిన వేడుకలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరై కేక్ కట్ చేశారు. పేద క్రైస్తవులకు ప్రభుత్వం తరపున క్రిస్మస్ గిఫ్ట్ ప్యాకెట్లను అందజేశారు.



ప్రభుత్వ దవాఖానలో ఆర్టీపీసీఆర్ పరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది

## అయ్యప్ప స్వాములూ జాగ్రత్త

కొత్త వేరియంట్ జేఎన్-1 ఎక్కువగా కేరళ రాష్ట్రంలో విజృంభిస్తున్నది. ఈ నేపథ్యంలో శబరిమలకు వెళ్లే భక్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, గుంపులు గుంపులుగా వెళ్లవద్దని చెబుతున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక వంటి ఇతర రాష్ట్రాలకు వెళ్లి వచ్చిన వారు, విదేశాల నుంచి వచ్చిన వారు తప్పని సరిగా కొవిడ్ పరీక్ష చేసుకోవాలని, జాగ్రత్తగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. ఈ వైరస్ ఎక్కువ మందికి సోకే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు సోకిన వారిలో వైరస్‌లో ప్రభావం అంతగా లేదని, దీని తీవ్రతపై ఇంకా ఒక అంచనాకు రాలేదని చెబుతున్నారు. అయినా ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముందని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఇమ్యూనిటిని పెంచుకుంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.



కొవిడ్ వార్డును పరిశీలిస్తున్న డాక్టర్ నవీన

# కరోనా అలర్ట్

## కలవరపెడుతున్న జేఎన్-1 వేరియంట్

### కరీంనగర్‌లో వెలుగులోకి రెండు కేసులు

ముఖ్యాంశాలు
- రాష్ట్రంలో విస్తరిస్తున్న వైరస్
- ఇప్పటికే రంగంలోకి యంత్రాంగం
- సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు
- అందుబాటులో కిట్లు
- ప్రభుత్వ దవాఖానల్లో ప్రత్యేక వార్డులు
- కరీంనగర్‌లో సిద్ధంగా 120 పడకలు
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు

**కరోనా మళ్లీ కలకలం సృష్టిస్తున్నది. కొత్తగా పుట్టుకొచ్చిన జేఎన్.1 వేరియంట్ కలవరపెడుతున్నది. తాజాగా కరీంనగర్‌లో రెండు కేసులు వెలుగులోకి రావడం భయపెడుతున్నది. ఇప్పటికే రంగంలోకి దిగిన యంత్రాంగం, వైరస్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నది. ప్రభుత్వ దవాఖానల్లో వ్యాధి నిర్ధారణ కిట్స్, మందులు ఉంచడమే కాదు, జిల్లా కేంద్రాల్లో ఆక్సిజన్ సదుపాయంతో ప్రత్యేకంగా వార్డులు ఏర్పాటు చేస్తున్నది. కరీంనగర్‌లో 120 ఆక్సిజన్ బెడ్స్‌ను సిద్ధం చేసింది. ఈ వైరస్‌తో పెద్దగా ముప్పు లేకపోయినా ఎక్కువ మందికి సోకే ప్రమాదముందని, అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాలని, బయటికి వెళ్తే మాస్కులు ధరించాలని సూచిస్తున్నారు.**



కరీంనగర్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ)/ విద్యానగర్ : కరోనా పేరువినగానే ప్రతి ఒక్కరిలోనూ భయం పుడుతున్నది. మూడేళ్ల క్రితం ప్రళయం సృష్టించిన వైరస్, తాజాగా మరోసారి కమ్ముకొస్తున్నదని తెలిసి భయాందోళన కనిపిస్తున్నది. అయితే గతంలో ఒమిక్రాన్, డెల్టా వంటి సబ్ వేరియంట్స్ రాగా, ఇప్పుడు కేరళ, జార్ఖండ్, మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో జేఎన్.1 అనే వేరియంట్ సోకుతుండడం కలవరపెడుతున్నది. ఇది గతంలో వచ్చిన ఒమిక్రాన్‌కు సబ్ వేరియంటని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలోనూ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాల వారీగా అధికారులు ఇప్పటికే అప్రమత్తమయ్యారు. వైరస్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ దవాఖానల్లో చర్యలు తీసుకుంటున్నారు. వ్యాధినిర్ధారణ పరీక్షలకు కావాల్సిన కిట్స్, చికిత్సకు అవసరమైన మందులు, ఆక్సిజన్ అందుబాటులో ఉంచారు. నాడు కరోనా సమర్థవంతంగా ఎదుర్కొన్న అనుభవజ్ఞులైన వైద్యులను సిద్ధంగా ఉంచారు. గతంలో పది వేలకుపైగా కరోనా బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించిన కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖానలో ఇప్పుడు కరోనా వార్డును సిద్ధం చేసి, 120 బెడ్స్ ఏర్పాటు చేశారు. అందులో ప్రతి బెడ్‌కు ఆక్సిజన్ సదుపాయం కల్పించారు. 74 వెంటిలేటర్లు, అందుబాటులో ఉన్న 2 ఆక్సిజన్ లిక్విడ్ ప్లాంట్లను కూడా సిద్ధం చేశారు. ఆక్సిజన్ కంస్ట్రేటర్స్‌ను రెడీగా ఉంచారు. వారం క్రితమే మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆర్టీపీసీఆర్ టెస్టుల కోసం 2,300, ర్యాపిడ్ టెస్టుల కోసం 400 కిట్స్‌ను అందుబాటులో ఉంచారు. జేఎన్-1 వైరస్ సోకినట్లు అనుమానించిన 30 మందికి ఇప్పటికే పరీక్షలు నిర్వహించారు. అందరికీ నెగటివ్ రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇక నుంచి ప్రతి అనుమానితులకు ఈ పరీక్షలు నిర్వహిస్తామని వైద్యులు చెబుతున్నారు.

### జేఎన్.1 వేరియంట్ లక్షణాలు

- జ్వరం
- ముక్కు కారడం
- గొంతు నొప్పి
- పొడి దగ్గు
- తలనొప్పి, ఒళ్లు నొప్పులు
- విరేచనాలు
- తీవ్ర అలసట
- ఆయాసం, కండరాల బలహీనత
- శ్వాస సంబంధిత సమస్యలు
- వైరస్ సోకిన నాలుగైదు రోజులకు ఈ లక్షణాలు కనిపించే అవకాశాలున్నాయని వైద్యులు తెలిపారు. క్యాన్సర్, మధుమేహం తదితర దీర్ఘ కాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.



### నాడు సమర్థవంతంగా కట్టడి



2020-21లో కరోనా కరాళ నృత్యం చేసింది. అనేక మందిని పొట్టన పెట్టుకున్నది. 2022లో వ్యాక్సిన్ వచ్చిన తర్వాత నుంచి కట్టడి చేసినా.. అప్పటి దాకా అప్పటి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఎంతో శ్రమించాల్సి వచ్చింది. 2020 మార్చి 17, 18 తేదీల్లో ఇండోనేషియా నుంచి కొందరు మత ప్రచారకులు కరీంనగర్ జిల్లా కేంద్రానికి చేరుకోగా, వీరందరికీ కొవిడ్ పాజిటివ్ ఉన్నట్లు అప్పటి యంత్రాంగం గుర్తించింది. వెంటనే వారిని హైదరాబాద్‌లో ఉన్న ఐసోలేషన్‌కు తరలించి చికిత్స అందించింది. అప్పటికే ముగ్గురు స్థానికులకు కూడా ఈ వైరస్ సోకినట్లు గుర్తించి, దేశంలోనే మొదటి కంటైన్‌మెంట్ ఏరియాను కరీంనగర్‌లోనే ఏర్పాటు చేసింది. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అప్పటి మంత్రి గంగుల కమలాకర్, కలెక్టర్ శశాంక, సీపీ కమలాసన్ రెడ్డి పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. వైరస్ కట్టడికి ఇక్కడ తీసుకున్న చర్యలు దేశానికే రోల్‌మోడల్‌గా నిలువగా, మార్చి నుంచి మే వరకు నిరంతరాయంగా 58 రోజుల పాటు లాక్‌డౌన్ నిర్వహించారు. కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో 350 బెడ్స్‌తో కరోనా వార్డులు ఏర్పాటు చేసి, పది వేలకుపైగా బాధితులకు మెరుగైన చికిత్స అందించారు. ఎక్కడా లేని విధంగా ఆక్సిజన్ ప్లాంట్స్ ఏర్పాటు చేసి సేవలందించారు. ఇది జరిగిన రెండేళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ కరోనా వేరియంట్ వస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు.

### నగరంలో రెండు పాజిటివ్

కరోనా జేఎన్-1 వేరియంట్ కరీంనగర్ జిల్లాను తాకింది. సోమవారం ఇద్దరికి పాజిటివ్ వచ్చినట్టు తేలింది. ఆర్టీపీసీఆర్ టెస్టు చేయగా, ఈ వైరస్ వచ్చినట్టు తెలిసింది. కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ వీరారెడ్డి ధ్రువీకరించారు. హైదరాబాద్‌లోని జీనమ్ సీక్వెన్స్ లాబ్‌కు శాంపిళ్లను పంపించినట్టు తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన దవాఖానాలో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసిన వైద్యాధికారులు, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఇది వరకే ప్రకటించారు.

**కొవిడ్‌పై సహాయం కోసం 104 నంబర్‌ను సంప్రదించాలని అధికారులు కోరారు. వినతులు, ప్రైవేట్ దవాఖానలు, ల్యాబ్‌లపై ఫిర్యాదుకు 9030227324 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సంప్రదించాలని సూచించారు.**

### మాస్కు విధిగా ధరించాలి



కరోనా జేఎన్-1 వేరియంట్‌తో పెద్దగా ప్రమాదం లేకున్నా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కొవిడ్ నిబంధనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. చలి గాలులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆస్తమా వ్యాధిగ్రస్తులు ప్రమాదాల బారిన పడే ప్రమాదమున్నది. మాస్కులు తప్పనిసరిగా ధరించాలి. ప్రభుత్వ దవాఖానలో అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేస్తున్నాం. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకుని మందులు వాడి ఆరోగ్యాలు కాపాడుకోవాలి. ఇప్పటికే 30 మందికి ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా, అందరికీ నెగెటివ్ వచ్చింది. జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి కేసులు లేవు. అయినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- నవీన, అదనపు ఆర్ఎంవో (కరీంనగర్)

### 120 బెడ్స్ సిద్ధం చేశాం



కొవిడ్ నేపథ్యంలో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో 100 బెడ్స్‌తో ఐసీయూ, ప్రాథమిక లక్షణాలు ఉన్న వారి కోసం 20 పడకలతో శారీ వార్డును ఏర్పాటు చేశాం. ప్రతి బెడ్‌కు ఆక్సిజన్ అందించేందుకు ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే దవాఖానలో మాక్‌డ్రిల్ నిర్వహించాం. పూర్తి స్థాయిలో పరీక్షల కిట్లు, మందులు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

- గుండా వీరారెడ్డి, సూపరింటెండెంట్ (కరీంనగర్)

### లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవాలి



కరోనా కట్టడికి ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి. లేదంటే కరోనా కొత్త వేరియంట్ ఎక్కువగా ప్రబలే ప్రమాదమున్నది. జిల్లా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరముంటేనే బయటికి వెళ్లాలి. తప్పని సరిగా మాస్క్ వాడాలి. ప్రజలు గుంపులుగా ఉండకూడదు. వైరస్ లక్షణాలున్న ప్రతి ఒక్కరూ విధిగా పరీక్షలు చేసుకోవాలి. ప్రతి పీహెచ్‌సీలో ఇలాంటి పరీక్షలు చేస్తున్నాం. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

- లలితాదేవి, డీఎంహెచ్‌వో (కరీంనగర్)

# రేపే సింగరేణి సమరం



- 'గుర్తింపు' సంఘం ఎన్నికలకు సర్వం సిద్ధం
- ఓటు వేయనున్న 39,773 మంది కార్మికులు
- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా పోలింగ్
- అదే రోజు రాత్రి ఫలితాలు
- బరిలో 13 కార్మిక సంఘాలు

**రేపటి సింగరేణి సమరానికి సర్వం సిద్ధమైంది. గుర్తింపు సంఘం ఎన్నికలకు అంతా రెడీ అయింది. రీజనల్ లేబర్ కమిషనర్, సింగరేణి ఎన్నికల అధికారి శ్రీనివాసులు ఆదేశాల మేరకు బుధవారం 11 ఏరియాల్లో పోలింగ్ నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమైంది. 84 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ ఎన్నికల్లో 13 కార్మిక సంఘాలు పోటీ చేస్తుండగా, సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది.**

గోదావరిఖని/ రామగిరి, డిసెంబర్ 25 : సింగరేణిలో ఏడోసారి గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగనున్నాయి. సోమవారం సాయంత్రం ప్రచారం ముగియగా, బుధవారం బ్యాలెట్ పద్ధతిలో ఎలక్షన్లు ఉండనున్నాయి. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అదే రోజు రాత్రి 7 గంటలకు ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు వెలువడనున్నాయి. మొత్తం 11 ఏరియాల పరిధిలో 39,773 మంది కార్మికులు తమ ఓటు హక్కు వినియోగించుకోనుండగా, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొత్తం 84 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పోలింగ్, కౌంటింగ్ సిబ్బందిని నియమించి, శిక్షణ తరగతులు కూడా నిర్వహించారు. కాగా, పోలింగ్ బూత్‌లను సోమవారం సంస్థ వ్యాప్తంగా ఆయా డివిజన్ల అధికారులు పరిశీలించారు. పోలింగ్ రోజు ప్రతి ఉద్యోగి తమ గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని సూచించారు.

### యువ కార్మికుల ఓట్లే కీలకం

ఈ ఎన్నికల్లో యువ కార్మికుల ఓట్లే ప్రధానం కానున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక టీబీజీకేఎస్ హయాంలో కారుణ్య నియామకాల ద్వారా దాదాపు 20వేల మంది డిపెండెంట్లకు ఉద్యోగాలు వచ్చాయి. ప్రస్తుతం యువ కార్మికులను తమవైపు తిప్పుకునేందుకు కార్మిక సంఘాలు శత విధాలా ప్రయత్నాలు చేస్తున్నాయి. జాతీయ సంఘాల నాయకులైతే అప్పుడే విందు రాజకీయాలకు తెరలేపినట్లు తెలిసింది. ఏదేమైనా గని కార్మికుల తీర్పు ఏ యూనియన్‌ను వరించనుందోనని నల్లనేలపై ఉత్కంఠ నెలకొంది.

### కార్మిక పక్షం టీబీజీకేఎస్

టీబీజీకేఎస్.. సింగరేణి చరిత్రలో లేని విధంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడమేగాక లెక్కకు మించి హక్కులు సాధించి కార్మికుల మనసును చూరగొన్నది. కేసీఆర్ సర్కారు ప్రోత్సాహం, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సారథ్యంలో ఆది నుంచీ కార్మికుల పక్షాన నిలుస్తూ వస్తున్నది. సింగరేణి యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన అనేక ప్రయోజనాలు సాధించింది. కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకొని ఒక్క పోరాటం లేకుండా దేశ చరిత్రలో ఏ ప్రభుత్వ రంగ సంస్థ సాధించని అభివృద్ధి సాధించింది. నూతన హక్కులతో పాటు జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిన హక్కులను కూడా సాధించి కార్మికుల గుండెల్లో గూడు కట్టుకున్నది. తాజాగా మూడోసారి బరిలో నిలిచింది. మరోసారి గెలిచేందుకు ఉవ్విళ్లూరుతున్నది.



# సంతోషాలు నింపాలి

- అందరూ కలిసి జరుపుకోవాలి
- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కమాన్ చౌరస్తా, డిసెంబర్ 25 : క్రిస్మస్ ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పండుగ అని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఈ పండుగను అందరూ కలిసి మెలిసి జరుపుకోవాలని సూచించారు. సోమవారం ఆయన కరీంనగర్‌తోపాటు నియోజకవర్గంలోని పలు చర్చిలను సందర్శించి, క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ అందరి జీవితాల్లో సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ శాంతిని కోరుకున్న వ్యక్తి ఏసు ప్రభువును అని గుర్తు చేశారు. ఏసు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ఆదర్శనగర్‌లోని బ్లెస్సింగ్ గాస్పెల్ మినిస్ట్రీస్ చర్చిలో ఎమ్మెల్యే గంగులను ఆశీర్వదించారు. కరీంనగర్ మండలం ఇరుకుల్లలోని బేతేలు ప్రార్థన మందిరంలో కేక్‌ను కట్ చేశారు. ఆయాచోట్ల ఆయన వెంట మేయర్ సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, నాయకులు బోనాల శ్రీకాంత్, గందె మహేశ్, అర్ష మల్లేశం, కర్ర సూర్యశేఖర్, క్రైస్తవ మతగురువు, క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్లలో కేక్ కట్ చేసి పాస్టర్‌కు తినిపిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్



ఆలయ ఆవరణలో భక్తులు

# వేములవాడకు 80వేల మందికి పైగా..

## కిటకిటలాడిన రాజన్న క్షేత్రం

వేములవాడ టౌన్, డిసెంబర్ 25: వేములవాడ రాజన్న క్షేత్రం కిక్కిరిసింది. రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో జనసంద్రమైంది. సుమారు 80 వేల మంది తరలివచ్చారు. ఉదయాన్నే ధర్మగుండంలో స్నానం చేసి, స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. ఏ లైన్‌లో చూసినా పెద్ద సంఖ్యలో కనిపించారు. రెండు మూడు గంటల పాటు క్యూలో ఉండి మరీ దర్శించుకున్నారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా ఆలయానికి ₹35 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో కృష్ణప్రసాద్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, భక్తులు నిలిపిన వాహనాలతో ఆలయ పార్కింగ్ స్థలం జాతరను తలపించింది. ఇటు రాజన్న అనుబంధ ఆలయాలైన భీమేశ్వరాలయం, బద్దిపోచమ్మ, నగరేశ్వరాలయాల్లోనూ రద్దీ కనిపించింది.

# ఆరు రైళ్లు రద్దు

- కొన్ని రైళ్లు పాక్షికంగా..
- రైల్వే నిర్వహణ పనులే కారణం

సిటీబ్యూరో, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రైల్వే నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. మిరాజ్-పార్లీ, కల్హాపూర్-నాగ్‌పూర్, కోల్హాపూర్-దనబాద్ వంటి రైల్వే స్టేషన్ల మధ్యలో ఆరు రైళ్లను రద్దు చేశామని చెప్పారు. ఈ నెల 26 నుంచి జనవరి 5 వరకు టైమ్‌టేబుల్ వారీగా రైళ్లను క్యాన్సిల్ చేశామని వెల్లడించారు. అలాగే మరో నాలుగు రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్టు తెలిపారు.

# కరీంనగర్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో చోరీ



- పలు రికార్డులు అపహరణ
- రంగంలోకి పోలీసులు
- దర్యాప్తు ముమ్మరం



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

కరీంనగర్ రాంనగర్, డిసెంబర్ 25: కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చోరీ కలకలం రేపుతున్నది. ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడినట్టు తెలుస్తున్నది. సెలవు దినం కావడంతో ఉదయం వాచ్‌మెన్ అటుగా వెళ్లి చూసే సరికి గొళ్లెం విరిగి, తాళం కింద పడి ఉన్నది. అనుమానం వచ్చి అధికారులకు సమాచారం అందించడంతో వెంటనే అక్కడికి కార్యాలయ సిబ్బంది చేరుకున్నారు. ఆ వెంటే వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. సాధారణ చోరీ వలే గొళ్లెం విరగ్గొట్టి ఉండడంతో దొంగల ముఠా పనే అయి ఉంటుందని భావించి క్లూస్‌టీం నిపుణులను పిలిపించారు. వెంటనే రంగంలోకి దిగిన క్లూస్ టీం నిపుణులు కార్యాలయం అంతా క్షుణ్ణంగా పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. కార్యాలయ సిబ్బందితో మాట్లాడి అధికారులను పిలిపించి లోపల ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని కూడా పరిశీలించారు. రాత్రి 11.30 గంటల సమయంలో ఒక వ్యక్తి లోపలికి ప్రవేశించినట్లు రికార్డు కావడంతో దాని ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. మరికొన్ని సీసీ కెమెరాల ఫుటేజీ కూడా పరిశీలిస్తే నిందితుడి ఆనవాళ్లు లభ్యమయ్యే అవకాశమున్నది. ఇదిలా ఉంటే మొత్తం రిజిస్ట్రేషన్ రికార్డులన్నీ డిజిటలైజ్ చేశామని, మ్యాన్‌వల్ రికార్డు పోవడం వల్ల జరిగే నష్టమేమీ లేదని చెబుతున్నారు. ప్రాథమిక పరిశీలనలో నిందితుడు కేవలం ఒక రికార్డును మాత్రమే తీసుకెళ్లినట్లు తేలడంతో కావాలనే ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.